
కథ

# భూలోకం డైరీ

**వ్యవస్థతో రాజీపడి ఏదో మేరకు లబ్ధి పొందడమే ధ్యేయమైన చోట ఏ వాదమైనా అవకాశవాదానికి దారితీయడం విచిత్రం కాదు. హిపోక్రసీ లౌక్యంగా చలామణీ అయ్యే చోట మనుషులు అలీనంగా ఉండలేరు. కనిపించని బీభత్సం జీవితాల్ని నియంత్రిస్తుంది. అభివృద్ధి భూతం మానవీయతను మింగేస్తుంది. ఈ నేపథ్యంలోనే ఒక సృజనశీలి అంతర్ బహిర్ సంఘర్షణలను వ్యక్తీకరించిన కథ ఇది.**



రాణి శివశంకర్

"బియ్యం చెట్లూ, గోధుమ చెట్లూ..."

"వరి కంకులూ, గోధుమ మొక్కలూ" అని మధ్యలోనే సరిదిద్దాడు భూలోకం.

ధనంజయనాయుడు నవ్వుతూ తెల్సు నాకూ తెల్సు. కాని మా స్టూడెంట్సు వాటిని అలాగే పిలుస్తారు. వాళ్లు ఇంగ్లీషు మీడియం స్కూల్స్‌లో కష్టపడి తెలుగు మర్చిపోయి, టీవీ యాంకర్స్ దగ్గర తిరిగి తెలుగు నేర్చుకున్నట్లుంటారు. వాళ్లలో కొంత మందికి ధాన్యం అంటే యేమిటో, అదెలా వుంటుందో తెలీదంటే నమ్మండి. నేనూ వొకప్పుడు పల్లెటూరి బైతునే అది సరే ముందు మీరు ఆ మొక్కలు గీసి పిల్లలకి వివరించాలి"

"ఎందుకు?"

"వాళ్లకి కంప్యూటర్లూ కాంపిటేటివ్ పుస్తకాలూ తప్ప మరో లోకం లేదు. క్రియేటివిటీ నేచురాల్టీ చచ్చిపోయాయి. చాలా మొక్కల గురించి, ప్రకృతి గురించి యేమీ తెలీదు. ప్రకృతి, పల్లెటూళ్లు అక్కడి మనుషులు వారి సహజత్వం నిష్కల్మషత్వం... అంతా మీ బొమ్మల ద్వారా వివరించాలి"

"పల్లెటూళ్లకి తీసుకుపోతే సరిపోతుందికదా?"

పగలబడి నవ్వాడు ధనంజయనాయుడు. "వీళ్లని పల్లెటూళ్లకి తీసువెళ్లాలా మీరనేదేమిటి?" వొక స్టూడెంటుని తీసుకువచ్చాడు బంట్రోతు.

నాయుడు ఆ స్టూడెంటుని ప్రశ్నించాడు "నీ ఫీజెంత?"

"సంవత్సరానికి అరవైవేలు"

"మీ ఫాదరేం చేస్తాడు?"

"కంప్యూటర్ ఇంజనీరు"

"జీతమెంత?"

"40 వేలు"

వాడు వెళ్లిపోయాక నాయుడు అన్నాడు "ఇతడినా మీరు పల్లెటూళ్లకి తీసుకువెళ్లమనేది. పేడవేయని వుచ్చపోయని బర్రెలుంటే చూపించండి కంపు భరించలేమంటారు వీళ్లు. వరి చేలల్లో బురద వుండకూడదంటారు"

భూలోకం అసహనంగా అన్నాడు "సరికొత్త నిష్టాపరులు, అసింటాగాళ్లు. పల్లెటూళ్లని వాటి మానాన వదిలెయ్యండి వాటి గోల వీళ్లకెందుకు?"

భూలోకం వొక ఆర్టిస్టు. వొక పల్లెటూళ్లో పుట్టాడు. చిన్నతనం నుంచి బొమ్మలు గీయటమంటే ఇష్టం. పల్లెటూరి ప్రకృతి సోయగాల్ని బొమ్మలుగా గీసి గుర్తింపు పొందాడు. అతని బొమ్మలు ధనంజయనాయుడు లాంటి యెందరో డబ్బున్న వాళ్ల భవంతుల గోడలకి సహజత్వాన్ని అద్దాయి. ఆ బొమ్మలకి మంచి ఖరీదు పలికింది అవార్డులు వచ్చాయి. ధనంజయనాయుడు వ్యవసాయ జూదాన్ని పూర్తిగా కట్టిబెట్టి, పొలం అమ్మి పత్తిలాంటి వ్యాపార పంటల మీద వచ్చిన లాభాలతో విద్యా వ్యాపారం ప్రారంభించి కోటికి పడగలెత్తాడు. ప్రశ్న పత్రాల్ని లీక్ చేయించాడని, సొంత సెంటర్లో మాస్ కాపీయింగ్ జరిపిస్తాడని ఇలాంటి ఆరోపణలు అతనిని యేమీ చేయలేకపోయాయి. అతడు వొకప్పుడు విద్యార్థి సంఘ నాయ కుడు కూడా.

"ఔను ఈ పల్లెటూరి సంత గోల కార్లలో తిరిగే వీళ్లకెందుకు? కాని కొందరు పేరెంట్సు రాసిన ఉత్తరాలు నా కళ్లు తెరిపించాయి" అని వొక ఉత్తరం భూలోకానికి ఇచ్చాడు.

"ఏం చదువులివి వట్టి యాంత్రికమైనవి ఎప్పటికీ వాడవని పూలకుండీల్లో కాగితం పూల నుంచి సంతృప్తిపడలేం కదా? చక్కని భాష, అభివ్యక్తి... అన్నీ యేమైపోయాయి? రేపు భార్యతో మాట్లాడ్డానికి కూడా అవసరమైన భాష లేదు వాడి దగ్గర. అనుభూతిపరమైన యెదుగుదలంతా నిలిచిపోయింది. నేనొక సైకాలజిస్టుని. అందుకే ఇం త బాధ. వాడి పరి పూర్ణ అభివృద్ధికి మీరు హామీ ఇవ్వాలి. వాణ్ణి మీకు పూర్తిగా అప్పజెప్పి ఫీజు చెల్లిస్తున్నాం"

చివరి వాక్యాన్ని అనాలోచితంగా అండర్‌లైన్ చేశాడు భూలోకం. "నన్నేం చెయ్యమంటారు నాయుడు గారూ?"

"భూలకం! నీ బొమ్మలంటే నాకు ప్రేమ. అందుకే నేను స్వయంగా నీ ఆర్టు ఎగ్జిబిషన్ పట్నంలో అనేకసార్లు యేర్పాటుచేశా. మేము కోల్పోయిందేదో మీ బొమ్మల్లో పొందినట్లనిపిస్తుంది చాలామంది నా మిత్రులకి కూడా.

భూలోకం నిట్టూర్చాడు. "ఎందరో నన్ను పొగుడ్తున్నారు. ఈ పొగడ్తలూ, రివార్డుల మధ్య నేను పోగొట్టుకున్నదేమిటో, యెవరికీ అక్కర్లేదు"

"మీ ఆర్టు అబ్సల్యూట్ సహజమైన పరిపూర్ణ సౌందర్యం" "అదే... అదే నాకు విసుగుతెప్పిస్తుంది" ఆవేశంగా భూలోకం.

యాష్‌ట్రేలో బూడిద రాలుస్తూ నాయుడు "అదంతా ఇప్పుడు అప్రస్తుతం. మీరు ఆర్టు క్లాసులు తీసుకొని మా విద్యార్థులకి రిలీఫ్ ఇవ్వాలి. మంచి జీతం ఇస్తా"

"నేను ఈ యాంత్రిక జీవులకి రిలీఫ్‌నిచ్చే అధమస్థాయి ఆర్టిస్టునా?" తనలో మధనపడ్డాడు భూలోకం.

** ** **

భూలోకం బొమ్మల్లో కన్న అతడు రోజూ రాసే డైరీలో అతని ఆత్మ క్షోభ బైటపడ్తుంది. భూలోకం నక్షత్రాల వైపు చూస్తూ ఆరుబైటపడుకున్నాడు. అనంతాకాశం, యెన్నో వేల గెలాక్సీలు, విశ్వం వ్యాకోచిస్తోందా ఆ గెలాక్సీలలో భూమెక్కడ, తన వూరెక్కడ, తానెక్కడ?

కాని ఈ అనంత జ్ఞానం తన వూరిని మింగెయ్యలేదు. తనవాడ, చప్పులు కుట్టే తండ్రి, వెలి వేతలు, సంఘ బహిష్కరణలు, ఊచకోతలు నష్టపరిహారంగా తన వూరి దళిత పిల్లల కోసం పెట్టిన స్కూల్లో చదువుకొన్నాడు. ఇప్పుడు పేరుమోసిన ఆర్టిస్టు. ధనంజయనాయుడితో కలిసి మందు విందులో అనేకసార్లు పాల్గొన్నాడు. నాయుడు తన బలిసిన మిత్రుల్తో- ఇతడు నా స్నేహితుడు. ఊరి అందాల్ని సహజంగా చిత్రిస్తాడు" అని మెచ్చుకున్నప్పుడు, వాడ వేదనల్ని, చిత్రించలేకపోయానన్న పశ్చాత్తాపం లోలోపల కలుక్కుమనేది.

తను సహజమైన చిత్రకారుడా? ఏది సహజం? ధనంజయ నాయుడికన్న తన వూరి దొరలే నయం. వారి దుర్మార్గం, దర్పం బైటికి కనిపిస్తాయి. ఈ పట్నపు దొరని నమ్మడం ఇంకా కష్టం. అన్ని యిజాలూ కళలూ ఆదర్శాలూ అన్నిట్నీ అపోసనపట్టిన ఈ పెద్దమనిషి అన్నిట్నీ మింగేసే డ్రాకులా.

ఆ భయంకర ముఖంలోనే తానున్నాడు నాయుడేకాదు శర్మ, వశిష్ట కూడా తనలోని సృజనాత్మకతకి సమాధి కట్టేస్తూ వచ్చారు. వారింకా ప్రమాదం.

** ** **

శర్మ వొక యూనివర్సిటీ లెక్చరర్. తన ఉద్యోగానికి లాంగులీవు పెట్టి ధనంజయ నాయుడి కాలేజిలో లక్షలు ఆర్జిస్తున్నాడు. రచయితల సంఘంలో సభ్యుడే కాని యెప్పుడూ యేమీ రాయలేదు. అప్పుడే రాయడం మొదలెట్టిన యువకుల్ని క్రూరమైన విమర్శతో, వెటకారంతో చంపేస్తాడు. అతని భారీకాయం కింద యెందరో రచయితలు వీరమరణం పొందారు.

శర్మ దురదృష్టవశాత్తూ పరిచయమయ్యాడు భూలోకానికి ఆర్టు ఎగ్జిబిషన్లో.

"ఇవి సరే యేమైనా పోరాటశీలమైన బొమ్మల్ని గీయకూడదా?" అన్నాడు శర్మ.

"నా అంతరంగాన్ని తెలిపే బొమ్మలు ఇవి కావు" అని భూలోకం తన బొమ్మలు నిండిన గదికి తీసుకువెళ్ళాడు.

ఆ బొమ్మలన్నీ అలవోకగా చూసి శర్మ

"కొన్ని సంక్లిష్టంగా వున్నాయి. ప్రజల కర్థమవుతాయా? "పికాసో గుయెర్నికా అలవోకగా అర్థమవుతుందా?"

"అది యుద్ధకాలపు బీభత్సానికి సంబంధించిన గొప్ప ప్రతీకాత్మక చిత్రమని కమ్యూనిస్టులందరూ మెచ్చుకుంటారు"

"ఈ బొమ్మలు దళితుడి అంతర్ బహిర్ యుద్ధం నుంచి వచ్చినవే వాటి పట్ల ప్రేమ సహానుభూతి వుంటే అర్థమౌతాయి"

"కాని వీటిలో పెటీ బూర్జువా మనస్తత్వం ఎక్కువ. అర్థభూతల అర్థ వలస దేశాల గ్రామీణ వ్యవస్థని మీరు పూర్తిగా అర్థం చేసుకుని, బోల్షివిక్ స్పిరిట్‌తో గీసినట్లు లేదు"

"మీరెప్పుడైనా గ్రామాలకి వెళ్లారా?"

"గ్రామాలకి తరలండి కార్యక్రమంలో వొకప్పుడు వెళ్లా". "నేను వాడలో పుట్టి పెరిగా. అక్కడి మనుషుల కష్టసుఖాల్ని అంతరంగాల్ని చదివా. వాళ్లలో నేనొకణ్ణి. మా నాన్న యుజిసి స్కేలు తీసుకునే లెక్చరర్ కాదు. చెప్పులు కుట్టుకునే మాదిగ"

"మీకు అసహనం ఎక్కువ. ఇలాంటి వాళ్లని మేం నెట్టేస్తాం. నువ్వు మాదిగవి కావచ్చు. మరి నీ వర్గం సంగతో...?

"తమదైన జీవితంలోంచి వచ్చిన వ్యక్తికరణని అర్థం చేసుకోడం నేర్చుకోవాలి మీరు. సిద్ధాంతాలకన్న అది ముఖ్యం"

"మేం వ్యక్తిగతాన్ని గుర్తించం"

"ఆకర్షణీయమైన మీ జీతనాతాల్ని వడ్డీ వ్యాపా రాల్నైనా వ్యక్తిగతంగా గుర్తిస్తారా?"

తలుపు ధణేల్మనిపించి శర్మ వెళ్లిపోయాడు.

** ** **

వశిష్ట పరిచయం మరో విషాదం. అతని కలుపు గోరుతనం దగ్గర చేసింది. "మీ బొమ్మలు మొత్తం గా చూడాలి నేను" అని పట్టుబట్టాడు వశిష్ట.

వొక నల్లని మనిషి చెప్పులు కుడ్తుంటాడు. అతని చుట్టూ గెలాక్సీలు, నక్షత్రాలు చిన్నిచిన్ని ఆకారాల్లో కుక్కపిల్లల్లా తిరుగుతుంటాయి. ఆ బొమ్మ కింద "నేను మాదిగని" అని రాశాడు.

"మీకు మీరే డప్పు పట్టుకొని చాటింపు వేసుకోడమెందుకు?" వశిష్ట.

"మీరు పొరబడ్తున్నారు. నా అసలు పేరు షరీఫ్. నేను వశిష్టగా పేరు మార్చుకొని, వొక మేరేజ్ బ్యూరో విజయవంతంగా నడుపుతున్నా. యెందరో పెద్ద కులాల వాళ్లు పెళ్లిళ్ల సమాచారం కోసం మా పూర్తి కంప్యూటరైజ్డ్ మేరేజి బ్యూరోకి వస్తారు. నేను మంచి పాటగాణ్ణి కూడా. నాయుడు తమ కాలేజి ఫంక్షన్స్‌లో సరస్వతీ ప్రార్థన నా చేతే చేయిస్తారు. ముస్లింల దేశభక్తిని శంకించేవాళ్లు కూడా నన్ను శంకించరు. మొన్న సరిహద్దు యుద్ధమప్పుడు ఊరేగింపు నడిపింది నేనే. ధనంజయనాయుడుగారు కూడా నన్ను చాలా మెచ్చుకున్నారు. నాతో కలిసి ఫోటో దిగారు" తనకు రాజకీయ నాయకుల్తో, పట్టణ ప్రముఖుల్తో పరిచయాల గురించి గొప్పలు చెప్పుకున్నాడు కూడా.

భూలోకానికి ఆశ్చర్యం నుంచి తేరుకోడానికి సమయం పట్టింది. మైకేల్ జాక్సన్ తన నలుపు రంగుని కృత్రిమంగా తెలుపుగా మార్చుకున్నాడంటారు. జాలిపడాలో, అసహ్యించుకోవాలో.

ఇంతకీ భూలోకం ఆ బొమ్మ గీసిన కొద్దిరోజులకే ఉవ్వెత్తున మాదిగ ఉద్యమం యెగసిపడింది. ఆ బొమ్మని బైటపెట్టి వుంటే యెంత స్ఫూర్తిదాయకంగా వుండేది. విశ్వాన్ని గురించి ఐన్‌స్టీన్ చేసిన విజ్ఞానాత్మక ఊహలు, తర్వాతికాలంలో ప్రయోగాత్మకంగా రుజువైనప్పుడు ఐన్‌స్టీన్ చాలా సంతోషించాట్ట.

నాయుడు బాగా తాగి వున్నప్పుడు తనకి నిద్రపట్టదని, గుండెనెప్పి కూడా వస్తోందని అంగ్తంభన కూడా సరిగా జరగడంలేదని, వయాగ్రా వాడదల్చుకొన్నానని చెప్పాడు. అటువంటి పెద్ద మనుషుల వ్యర్థ పరుగుపందెంలోని జుగుప్సావహస్థితిని చిత్రించాడు భూలోకం. ఈ బొమ్మలో సింబాలిజం మితిమీరి అస్పష్టంగా మారిపోయిందని, ప్రయోజనం కూడా శూన్యమన్నాడు శర్మ.

సరిహద్దు యుద్ధంలో మరణించిన వారికన్న ఇటీవల రోగాల వల్ల మరణించిన గిరిజనులే ఎక్కువైనప్పటికీ, దేశంలో యెవరూ పట్టించుకోకపోవడాన్ని (వొక కవిత ఆధారంగా) నిలదీస్తూ బొమ్మ గీశాడు. వశిష్ట పెదవి విరిచాడు. "దళిత కవుల్తోసహా అందరూ వీరుల్ని వీరమాతల్ని స్తోత్రం చేస్తూ దేశభక్తి గీతాలు వల్లిస్తుంటే, ఈ బొమ్మలేంటి? దిలీప్‌కుమార్‌పై పాకిస్తాన్ బిరుదుని తిరస్కరించమని వత్తిడి రావడం, ఆయన వాజ్‌పేయ్ దగ్గరికి పరిగెత్తడం నీకు తెలీదా? అందరూ దేశద్రోహి అంటారు నిన్ను."

ఉద్యమాల్లోని అవకాశవాదాన్ని అపరిణతిని విమర్శిస్తూ బొమ్మలు వేశాడు.

దళితుల చీలికలూ, కొట్లాటలూ నాయకుల అవకాశవాదమూ ఇలాంటి విషయాల్ని కూడా చిత్రించాడు. కాని రెంటికీ చెడ్డ రేవడినౌతానన్న భయంతో దాచేశాడు.

ఇంకా దళితులపై వివక్ష, ఊచకోతలు.... వొకటేమిటి సమాజాన్నంతట్నీ నిలదీసే బొమ్మలెన్నో. ఈనాడు ఆ బొమ్మలే భూలోకాన్ని నిలదీస్తున్నాయి.

"నువ్వెందుకు మాకు జన్మనిచ్చావ్? సృజించి చీకట్లోనే మగ్గిపొమ్మని యెందుకు శపించావ్? నీ అసలైన గీతల్ని రాతల్ని కప్పిపుచ్చి, పెద్ద మనుషులు గీసిన గీతల్ని జవదాటకుండా యెందుకు బతుకుతున్నావ్? పరాయి పాటలకి ఎందుకు వంత పాడ్తున్నావ్? నీ భయాల్లో సంకోచాల్తో మా బతుకుల్ని చీకటిమయం చేసే అధికారం నీకెవరిచ్చారు? అందరి ముందుకి వెళ్లవలసిన మా హక్కుని నువ్వెందుకు నిరాకరించావ్?" భూలోకం యేం చెప్పాలో తెలీక తల తిప్పుకొని, కిటికీలోంచి బైటికి చూశాడు.

నల్లని మేఘాలు అతని చిత్రాల్లా ఆకాశాన్నంతటినీ నిస్సంకోచంగా ఆక్రమించుకొంటున్నాయి. కడుపు చించుకొని తమ ఆగ్రహాన్ని, ఆవేదనని వర్షించబోతున్నాయి.


"భూలోకమా! మేఘ సందేశాన్ని యెవరూ ఆపలేరు" అని తనకీ తాను నివసిస్తున్న నేలకీ వొకేసారి స్వగతంగా చెప్పుకొన్నాడు భూలోకం.

# శిలలాంటి జీవితాన్ని శిల్పంగా మలచుకున్నాను

నేను ఒక దళితకుటుంబానికి చెందిన వ్యక్తిని. చిన్ననాడే తండ్రిని పోగొట్టుకున్నాను. తల్లి సంరక్షణలో పెరిగాను. ఎన్నో కష్టాలను ఓర్చి పాఠశాల విద్యను పూర్తిచేశాను. చిన్నతనంలోనే కష్టాలు అనుభవంలోకి రావడంతో జీవితం బాగా అర్థమవసాగింది. 1982లో కొక్కిరేణి గ్రామంలో 10వతరగతి పూర్తిచేశాను. మా స్వగ్రామానికి 26 కిలోమీటర్ల దూరంలోని సూర్యాపేటలో ఇంటర్‌మీడియెట్ చదివాను.

స్వగతం

చదువుతో పాటు విప్లవాత్మక రచనల ద్వారా ప్రేరణ పొందాను. ఆదర్శభావాలు మనసులో ప్రోదిచేసుకున్నాయి. సామాజిక దురాచారాలను వ్యతిరేకించే నా ఆలోచన నా వయ సుతో పాటు పెరగసాగింది. వరకట్న దురాచారం వల్ల ప్రతిరోజు సమిధలు మారుతున్న మహిళల్ని చూసినపుడు హృదయం ద్రవించేది.



శరత్‌చంద్ర కుటుంబం

అంబేద్కర్, చలం, స్వామివివేకానంద, ఠాగూర్, శ్రీశ్రీ వంటి గొప్పకవులు, రచయితల, మేధావుల పుస్తకాలు చలవ నన్ను ఓ ఆదర్శవంతమైన జీవితాన్ని రూపుదిద్దుకోమని ప్రేరేపించింది.

నేను ఇంటర్‌లో ఉన్నప్పుడే శోభారాణితో కాకతాళీయంగా పరిచయం అయింది. క్లాసుమేట్స్‌మి కాకపోయినా బ్యాచ్‌మేట్స్‌మి. సాంఘికదురాచారాల్ని ఏవగించుకునే, కులమతాల జాఢ్యాన్ని ద్వేషించే మా ఇద్దరి మనసులు, ఆదర్శభావాలు ఒకరికొకరికి అర్థమయ్యాయి. దళితుల పట్ల, పీడితుల పట్ల ఆమెకు కల మానవీయస్పందన నన్ను ఆకట్టుకుంది. భావాల కలయిక మనసుల కలయికగా మారింది. ప్రేమకు దారితీసింది. రెడ్డి కులానికి చెందిన ఆ అమ్మాయిని మైనర్ వయసు దాటకుండానే (ఇద్దరం మైనర్లమే) 1983లో పెళ్ళిచేసుకున్నాను. ఖమ్మం జిల్లా జీళ్ళచెర్వు గ్రామంలోని శ్రీవెంకటేశ్వర దేవాలయంలో పెళ్ళి జరిగింది. అటు ఇటు బంధువులు ఎవరూ లేరు. మిత్రుల సహాయసహకారాలే మిగిలాయి.

మా కులాంతర వివాహంలో ఎలాంటి పొరపొచ్చాలు రాలేదు. ఆమె సహృదయత, ప్రేమానురాగాలు జీవితంలోని చేదును మరిచేలా, ఒక్కొక్కమెట్టే ఎక్కుతూ ఆశయాలసాధనకు శ్రమించేలా చేసింది. మేం ఇద్దరం పరస్పర అవగాహనతో, ఒకరి భావాలను, ఆలోచనలను మరొకరు గౌరవించుకుంటూ కాపురం మొదలుపెట్టాం. కొనసాగిస్తున్నాం.

వివాహం తర్వాత ఇద్దరం స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుకుంటూ, బతకడానికి ట్యూషన్లు చెప్పడం మొదలుపెట్టాం. కాలేజీ అయిపోగానే ట్యూషన్లు మొదలయ్యేవన్నమాట. పూటగడవడానికి ట్యూషన్లు మొదలుపెట్టగా, క్రమక్రమంగా మా ఆర్థిక పరిస్థితి కూడా మెరుగయింది. 1989లో సూర్యాపేటలో 'విశ్వభారతి ఉన్నతపాఠశాల'ను స్థాపించాం. రాత్రిపగలంటూ లేకుండా కష్టపడటం మొదలెట్టాం. సహోపాధ్యాయుల కృషి, సహకారంతో 1990 సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు సాధించడం కూడా జరిగింది. పట్టణంలోనే మంచి పేరున్న పాఠశాలల్లో ఒకటిగా తీర్చిదిద్దాం. ఇప్పుడు స్కూలులో 18 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యార్థులు 600 మంది ఉన్నారు. వీరిలో ఆర్థికస్థితి సరిగా లేని కొంతమంది పేదపిల్లలకు ఉచితంగా విద్యను అందిస్తున్నాం. మా ఆశయాలకు అనుగుణంగానే పాఠశాలను నడుపుతున్నాం. ఎప్పుడైతే నా ఆర్థికపరిస్థితిని మెరుగు పరుచుకున్నానో, అప్పుడే మా గ్రామంలో నా వాటా స్థిరాస్తి మా అన్నయ్యకు ఇచ్చేశాను. అంతకు ముందుకూడా నేనెప్పుడు పంటను ఆశించలేదు. అన్నయ్యకు మెరుగైన జీవితాన్ని అందించినవాడిగా తృప్తిని పొందాను.

1995 సెప్టెంబర్ 9వతేదీన నేను గ్రామ అభివృద్ధి అధికారిగా ఎ.పి.పి.ఎస్.సి. ద్వారా ఎంపికైనాను. మెదక్ జిల్లాలో కొంతకాలం పనిచేశాను. ఇప్పుడు నల్లగొండ జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయ్యాను. ప్రస్తుతం సూర్యాపేట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామఅభివృద్ధి అధికారిగా పనిచేస్తున్నాను. ఇద్దరు పిల్లలు. స్నిగ్ధ , యశస్వి. ఆరు,నాలుగు తరగతులు చదువుతున్నారు.

జీవితంలో ఎన్నో కష్టనిష్ఠూరాలు చవిచూశాను. ప్రతికూలపరిస్థితుల్లో ఎదురీదాను. కానీ ఆశయాలు, ఆదర్శాలపట్ల మమకారం మాత్రం వదలలేదు. దళితుడినన్న భావనతో ఎక్కడా కృంగిపోలేదు. ఎలాంటి జీవితాన్నయినా మనకు అనుగుణంగా మలచుకోవచ్చు అన్నది నా ఫిలాసఫీ...కాస్త కష్టపడితే!

– బచ్చులకూరి శరత్‌చంద్ర